ఓం శ్రీ సత్యసాయిరాం

సత్యం　　　　　　　　　　　శివం　　　　　　　　　　　సుందరం

రూపక పరిచయం

భగవాన్ శ్రీ సత్యసాయీశ్వరునకు నమస్కరిస్తూ – ఈనాటి కార్యక్రమానికి విచ్చేసిన, తల్లితండ్రులకు, బాలబాలికలకు, సంస్థసభ్యులకు సాయిరాం–

ఇప్పుడు మేము ప్రదర్శించబోయేది "ప్రభాతపారిజాతం శ్రీకామరాజు అనిల్‌కుమార్" అనే చర్చారూపకం.

నందన ఉద్యానవనంలో – పారిజాతవృక్షాలుంటాయి. అవిదైవీవృక్షాలు – వాటికొమ్మల నుండి అరవిరిసిన పారిజాత ప్రసూనాలు – ప్రభాతవేళలో – హృదయోద్దీపన పరిమళాలను వెదజల్లుతూ ఉంటాయి.

అట్లా తన తేనెల తేటల మాటలమూటలతో పారిజాత ప్రసూనాల పరిమళాలను వెదజల్లి మన హృదయానంద డోలికలలో విహరించినవారు 'శ్రీకామరాజు అనిల్‌కుమార్'

ఆయన ఇంటిపేరులోను, ఒంటిపేరులోనే ఉన్నాయి శాశ్వతతత్త్వాలు.

'కా' అంటే, 'కామనలను',

'మ' అంటే లేకుండా చేసుకొనే,

'రాజు' – అంటే చంద్రుడు –

అనగా వాసనారహితుడు. చల్లగా, తెల్లగా, పవిత్రంగా ప్రకాశవంతంగా సంచరించేవాడని, మోక్షార్హుడని ఇంటి పేరులోని అర్థం.

కాని ఆయన దాన్ని కోరుకోలేదు – ఒకసారి స్వామి ఆయనను "నీకు ఏవరం కావాలన్నా ఇస్తాను. మోక్షమైనా ఇస్తాను ఏదైనా కోరుకో" అంటే – "నాకు అన్నీ ఉన్నాయి స్వామీ – ఏ వరం వద్దు – ఇక మోక్షమంటారా? అది ఎట్లా ఉంటుందో నీకు తెలియదు – నాకు తెలిసింది మీరే –

మీరు ప్రతీయుగంలోను అవతరిస్తానంటారు కదా! అలా మీరు అవతరించినపుడల్లా మీతోపాటుగా జన్మనిచ్చి, మీ దివ్యత్వాన్ని దిక్, దిగంతాలు వ్యాపించేటట్లుగా ఉపన్యాసాన్ని ఇచ్చే అదృష్టాన్ని అనుగ్రహించండి స్వామి!" అని అంటే "సరే" అని ఆయనవద్ద ఆశీస్సునందుకొన్న మనీషి – ఋషి. ఎందుకు ఆయనకు స్వామినుండి ఆ అనుగ్రహం లభించింది? అంటే – ఆయనలో

అ – అహంకారమనేది, నిల్ – లేనే లేదు కనుక. అందుచే ఆయన ముఖారవిందం ఎప్పుడూ ప్రకాశమానంగా బ్రహ్మతత్త్వంతో విరాజిల్లుతూ ఉండేది.

అటువంటి మహామనీషి ది. 03.04.24 తేదీ ఉదయం 8.00గంటలకు స్వామి దివ్యచరణాల విందాలలో లీనమయ్యారు –

వారికి స్మృత్యంజలిగా ఈ రూపకం

– జై సాయిరాం–

(తెరలేచేసరికి / లైట్లువెలిగేటప్పటికి)

(రవి అటూ ఇటూ తిరుగుతూ ఉంటాడు ఏదో ఆలోచిస్తున్నట్లుగా విచారమైన ముఖంతో) – ఇంతలో శివ ప్రవేశిస్తాడు

శివ : సాయిరాం! రవీ !

రవి : సాయిరాం! శివా !

శివ : ఏమిటి రవీ! ఆలోచిస్తూ అటూ ఇటూ తిరుగుతున్నావు – పైగా విచారంగా ఉన్నట్లో ఉన్నావు.

రవి : విచారంకాక ఏమిటి శివా! ఇంతక్రితం మొబైల్‌లో వచ్చిన వార్త ....
(అని అంటూండగా – జీవన్, అబ్దుల్లా అనే ఇద్దరు ప్రవేశిస్తూ – సాయిరాం రవీ, సాయిరాం శివా – అనగానే)

రవి, శివ : (ఇద్దరూ ఒకేసారి) – సాయిరాం జీవన్, సాయిరాం అబ్దుల్లా (అంటారు)

జీవన్ : ఏమిటి రవీ! మొబైల్‌లో వచ్చిన వార్త అంటున్నావు

రవి : మన సత్యసాయిభగవానుని తియ్యనైన, కమ్మనైన తెలుగు ఉపన్యాసాలకు – అనేక సంవత్సరాలపాటు ఆంగ్లాను వాదం చేయటమేకాక – మన రాష్ట్రంలోని పల్లెపల్లెలోను, పట్టణాలలోను, దేశ విదేశాలలోను శ్రీ సత్యసాయిదివ్యతత్త్వాన్ని వ్యాపింపజేసిన ప్రభాత పారిజాతం వాలిపోయింది – రాలి పోయింది – ఒక మోహన గళం ఆగిపోయింది.

శివ : ఏమిటి రవీ! నీవు చెప్పేది – అనిల్‌కుమార్ గారి గురించేనా?

రవి : అవును – ఆయనగురించే –

శివ : ఎప్పుడు జరిగింది.

రవి : ఈ రోజే. ఇవాళ ఏప్రియల్ 3వ తేదీయే కదా! – ఇంతకుముందు ఒక అరగంట క్రితం 8.00 గంటలకు

శివ : అయ్యో! ఎంత ఘోరం జరిగింది – ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉండే ఆదరహాసం చెదిరి పోయిందా?

జీవన్ : అబ్దుల్లా, నేను ఈ మధ్యే బాలవికాస్‌లోకి వచ్చాంకదా! ఆయనెవరు ఇంతకీ?

అబ్దుల్లా : నాకుకూడా తెలుసుకోవాలని ఉంది కొంచెం చెప్పరా – మీరిద్దరూ –

రవి : ఆయన శ్రీరామునికి హనుమంతుడు ఎటువంటి సేవకుడో – అటువంటి సేవకుడు – "సత్యసాయికి" – సత్యసాయి నామాన్ని అనటం – అనిపించడం – ఆనందించడం – ఆనందింపజేయడం. ఆయన పని – ఆయనే ప్రొఫెసర్ అనిల్‌కుమార్ కామరాజు

శివ : అవును రవీ! ఈ మధ్యనే – మనబాలవికాస్ గురువుగారు ఆయన తండ్రి పేరు శ్రీ బాపనయ్య గారనీ, ఆర్.డి.ఒగా పనిచేసి రిటైరయ్యారని, వారి తల్లి శ్రీమతి సరోజినీ దేవిగారని, అప్పట్లో ఆమె మొట్టమొదటి పోస్టు గ్రాడ్యుయేట్ అని, ఆమె కూడా జిల్లా విద్యాశాఖాధికారిగా పనిచేసి రిటైరయ్యారని చెప్పారు కదా!

రవి : అవును – అంతేకాదు – వీరికుటుంబం బ్రహ్మ సమాజ మతాన్ని అనుసరిస్తూ, నిజాయితీగా వ్యవహరించే వారని. కాని అనిల్‌కుమార్ గారి భార్య శ్రీమతి విజయలక్ష్మి హిందూమత సంప్రదాయిని అని – అయినా అందరూ అన్యోన్యంగా ఉండేవారని చెప్పారు కూడా.

అబ్దుల్లా : అయితే రవీ! వీరు స్వామి దగ్గరకు ఎప్పుడు చేరారు –

రవి : 1972లో భార్య అనారోగ్య కారణంగా శ్రీ సత్యసాయి దర్శనానికి వచ్చి శ్రీ సత్యసాయి అనుగ్రహానికి పాత్రులై, స్వామి సేవాకార్యక్రమాలలో పాల్గొంటూ ఉండేవారు.

జీవన్ : ఆ రోజునుండే వారు స్వామికి దగ్గరగా ఉండేవారా?

శివ : కాదు – కాదు – 7 సంవత్సరాలు నిరీక్షించవలసి వచ్చింది – 1977లో దివిసీమలో సంభవించిన ప్రకృతి బీభత్స క్షతగ్రాతులకు, ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలవారికి, వివిధ సేవలు అందించారు.

రవి : అంతేకాదు – సాయిరాం – స్వామి తనను చూడక పోయినా మాట్లాడకపోయినా,
ఈ 7 సంవత్సరాలు తినీ, తినక, ఎండనక, వాననక, రైల్వేస్టేషనులలో ప్లాట్ ఫారాలపై పడుకుంటూ గ్రామ గ్రామాలలో స్వామి తత్త్వాన్ని వ్యాప్తి చేసారు.

శివ : ఇలా ఆయన అలుపెరుగని సేవలలో పాల్గొంటూ ఉండగా భగవానుని ప్రేమ వాత్సల్యం ఈయనపై ప్రసరించింది. అది 1979 దసరా పండుగలలో స్వామి ఆదేశానుసారం పుట్టపర్తిలో తెలుగులోను ఇంగ్లీషులోను ఉపన్యసించడం జరిగింది – అప్పటినుంచి స్వామి వెన్నంటే ఉన్నారు – స్వామి ఎక్కడ ఉంటే – ఈయన అక్కడ – స్వామే ఈయన. ఈయనే స్వామి అనేటట్లు ఉండేవారు.

అబ్దుల్లా : స్వామి ఈయనను ఎన్నిదేశాలకు పంపి ఉంటారు.

రవి : సుమారుగా 35 దేశాలకు పైబడి

జీవన్ : స్వామి తత్త్వాన్ని తెలియజేయటానికి ఈయన ఏమైనా రచనలు చేసారా!

రవి : చేయకే – మన మాసపత్రిక సనాతన సారథిలో వ్యాసాలు వ్రాయడమే గాక (1) ప్రభాత పారిజాతాలు (2) ప్రేమతరంగిణి (3) సత్యోపనిషత్ (4) చైతన్య ప్రవంతి (5) అంతరంగ సాయి – ఆత్మజ్ఞానసాయి (6) అహం సత్యబోధకః (7) కాంతిరేఖలు (8) జ్ఞాపకాల పందిరి … ఇలా ఎన్నో సుమారుగా 30కి పైగా రచనలు చేసి ఉంటారు.

శివ : అందుకే స్వామి ఈయనతో “నా పని నీవుచూడు – నీ పని నేను చూసుకుంటాను”– అని వీరి ముగ్గురి అమ్మాయిల వివాహాలు, స్వామే దగ్గరుండి చేయించడమే – కాదు వీరి అబ్బాయి చదువు, ఉద్యోగాల విషయంలో స్వామి ఎంతో అనుగ్రహాన్ని కురిపించారు.

జీవన్ : రవీ! స్వామి చెప్పిన సందేశాలలో అనిల్‌కుమార్ గారి ద్వారా చెప్పినవి నీకేమైనా తెలుసా?

రవి : 2 నెలల క్రితం బాలవికాస్ క్లాస్‌లో మనబాలవికాస్ గురువుగారు– Ego గురించి – అనిల్ కుమార్‌గారు మాట్లాడిన మాటలు చెప్పారు అవి, "భగవాన్ బాబా, Ego కి వైద్యం చేయడంలో సిద్ధహస్తులు – ఈ అవతారం దేనినైనా సహిస్తుందికాని అహంకారాన్ని సహించలేదు. 10 సం॥ల తర్వాత రాబోయే అహంకారానికి ఈ రోజే వైద్యం చేస్తారు".

అబ్దుల్లా : శివా! నీవుకూడా ఏదైనా ఒకదానిని గూర్చి చెప్పు.

శివ : ఒకసారి జెలసీ – అసూయ అనేదాని గురించి చెపుతూ ఈ అసూయ అనేది అత్యంత భయంకరమైనది. మనిషిని సర్వనాశనం చేస్తూ నిలువునా దహించి వేస్తుంది. దీనివల్లనే యుద్ధాలు జరుగుతాయి. ఒకరి అభివృద్ధి మరొకరు చూడలేరు – నిరాశా నిస్పృహలు ఏర్పడతాయి – ఇతరులతో స్నేహాన్ని పాడుచేస్తుంది. ఈ అసూయవల్ల వ్యక్తి అందమంతా పోయి అనాకారిగా కనబడతాడు – అని చెప్పారు.

రవి : ఇప్పటికే చాలా సమయం అయింది – ఆయన గురించి ఎంత చెప్పినా ఎన్నాళ్ళు చెప్పినా తరగదు.

శివ : అంతేకాదు – రాబోయే ఆదివారం మన బాలవికాస్ పిల్లల్ని అందరినీ ఒకచోట చేర్చి, మన బాలవికాస్ గురువులు సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేస్తారుట అపుడు మరిన్ని విషయాలు తెలుసుకుందాం.

(ఒకరికొకరు సాయిరాం చెప్పుకొని నిష్క్రమిస్తారు)

–o–

సాయిరాం అండీ! ఇంతవరకు రూపకాన్ని ప్రదర్శించిన చిన్నారులకు – ఆశీస్సులందిస్తూ ప్రొఫెసర్: శ్రీ కామరాజు అనిల్ కుమార్‌గారికి స్మృత్యంజలిగా

ఒక ప్రేమవృక్షం – వాలిపోయింది
ఒక ధృవతార – రాలిపోయింది
ఒక మోహనగళం – ఆగిపోయింది
ఒక దరహాసం – చెదరిపోయింది
ఒక మిసిమి పలుకు – పసిమి వీడింది
80 లో 40 నవచైతన్యం –
మళ్ళీ వస్తానంటూ కదలిపోయింది
అదంతా దైవలీల
రాకపోకలు ఆయన హేలావిలాసాలు
నిమిత్తమాత్రులం మనం –
చూస్తూ ఉండాలి వారు చెప్పినవి చేస్తూ ఉండాలి
ఇదే ఆయనకు మనం సమర్పించే సరియైన కృతజ్ఞతా నివాళి
జై సాయిరాం